## కథాకేళి



# మల్లాది వెంకటకృష్ణమూర్తి

## మేరా భారత్ మహాన్ హై

ఓ ప్రభుత్వకార్యాలయం లోని గది అది. అది రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయం కావచ్చు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయం అవచ్చు లేదా ప్రభుత్వ సంస్థ కార్యాలయం అవచ్చు. స్థలం ఏదైనా కథలో మార్పు వుండదు.

ఆ గదిలో ముగ్గురు అభ్యర్థులు కూర్చుని వున్నారు. యు.డి.సి. పోస్ట్‌కి ఇంటర్వ్యూకి వచ్చారంతా. ఒక్కో అభ్యర్థినే పిలిచి ముగ్గురు ఇంటర్వ్యూ చేయసాగారు. వాళ్ళు ముగ్గురూ రిటెన్ టెస్ట్‌లో పాసయిన అభ్యర్థులు. వాళ్ళకిచ్చిన ప్రశ్నల్లో ఒకరు ఎనభై శాతం సమాధానాలు సరిగ్గా చెప్పాడు. ఇంకొకడు వంద శాతం సమాధానాలు సరిగ్గా చెప్పాడు.

వంద శాతం సమాధానాలు చెప్పిన వ్యక్తికి, ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లకి మధ్య అతి వేగంగా జరిగిన ఆ ప్రశ్న-జవాబులు మెషిన్ గన్ నుంచి గుళ్ళు బయటకి వచ్చిన రీతిని, అంతర్జాతీయ టెన్నిస్ పోటీలో ఒక ఆటగాడు ముగ్గురు ఆటగాళ్ళతో ఏక కాలంలో ఆడి వాళ్ళ బంతులని తిప్పికొట్టినట్లుగా అనిపిస్తాయి మాపరులకి.

"లోహ్రి పండుగ ఏ రాష్ట్రంలో సెలబ్రేట్ చేస్తారు?"

"పంజాబ్‌లో"

"ఏ దేముణ్ణి ఆ రోజు కొలుస్తారు"

"సూర్యుణ్ణి"

"నైన్టీన్ ఎయిటీత్రి ఏప్రిల్ ఎయిత్‌న మన దేశంలోని ఏ రాష్ట్రంలో ముఖ్య మంత్రిగా పదవీ స్వీకారం చేశారు?"

"హిమాచల్ ప్రదేశ్‌లో, వీరభద్ర సింగ్"

"ప్రపంచంలోని ఏకైక హిందూ రాజ్యం ఏది?"

"నేపాల్"

"మౌంట్ ఎవరెస్ట్‌కి ఆ పేరు ఎందుకు వచ్చింది?"

"పద్దెనిమిది వందల నలభై ఒకటిలో నేపాల్-టిబెట్ మధ్య గల ఏరియాని మేప్‌ల కెక్కించినందుకు ఆయన పేరు పెట్టారు."

"దీప కన్నా దినేష్ మూడింతలు వేగంగా నడవగలడు. ఓ ఆరు గంటల్లో దినేష్ నడిచిన దూరాన్ని దీప నడవడానికి ఎన్ని గంటలు పడుతుంది?"

"పద్దెనిమిది గంటలు"

"దీనికి సమాధానం చెప్పు. సుమత్ పడమరకి వెళ్తూ ఎడమ వైపు తిరిగికొంత దూరం వెళ్ళాక మళ్ళీ కుడివైపు తిరిగాడు. కొద్ది దూరం తరువాత మళ్ళీ ఎడమవైపుకి తిరిగాడు. ఇంకొంచెం దూరం వెళ్ళాక కుడి వైపుకి తిరిగాడు. మళ్ళీ కొద్ది దూరం వెళ్ళాక ఎడమకి, కుడికి తిరిగాడు. ఇప్పుడు ఆ సుమత్ ఏ దిక్కు ప్రయాణిస్తున్నట్టు"?

"పడమర వైపు"

"పి.ఆర్.పి. ఫుల్‌ఫాం?"

"ప్లుటోనియం రీసైక్లింగ్ ప్రాజెక్ట్"

"అర్జున్ అవార్డ్సు దేనికిస్తారు?"

"ఆటల్లో గెలుపొందినవారికి"

"రాకేష్ శర్మ రేంక్ ఏమిటి?"

"స్క్వాడన్ లీడర్"

"గీత గోవిందని ఎవరు, ఎప్పుడు ఏ భాషలో వ్రాశారు?"

"సంస్కృతంలో జయదేవుడు పన్నెండో శతాబ్దంలో రాశాడు."

"ప్రపంచంలోని మనుషులచేత నిర్మింపబడ్డ అతి పెద్ద చెరువు ఏది? అందులో ఎంత నీరు పడుతుంది?"

"పేరు ఓవెన్ ఫాల్స్. ఉగాండాలో వుంది ఇది. 204.800 మిలియన్ క్యూబిక్ మీటర్లు దీని కెపాసిటీ."

"కోసి, అరున్, కాలి, కర్నాలి, భాగ్‌మతి నదులు ఎక్కడ వున్నాయి? ఆ దేశ జనాభా ఎంత?"

"నేపాల్‌లో. ఎనభై రెండు సెన్సెస్ ప్రకారం పదిహేను కోట్ల ఇరవై వేల నాలుగు వందల ఏభై ఒక్క మంది."

ఆటలో అలిసిపోయి ఓడిపోయినవాళ్ళలా అయారు ఆ ముగ్గురూ. ఒకతను చిరునవ్వుతో అడిగాడు ఆ అభ్యర్థిని-

"జనరల్ నాలెడ్జికి నువ్వు చదివే పుస్తకాలేమిటి?"

"అన్ని దిన పత్రికలు, కెరీర్స్ డైజెస్ట్, కాంపిటీషన్ సక్సెస్, రీడర్స్ డైజెస్ట్, ఇండియా టుడే..."

"నువ్వు వెళ్ళచ్చు"

అతను బయటకి వెళ్ళాకఇంటర్వ్యూ బోర్డులోని మిగతా ఇద్దరూ తమ బాస్ అయిన మూడవ అతని వంక చూస్తూ చెప్పారు-

"అందరికన్నా ఇతను బ్రిలియంట్‌లా వున్నాడు. ఇతన్ని సెలెక్ట్ చేద్దాం."

బాస్ చిన్నగా నవ్వి చెప్పాడు—

"సంజయ్ కుమార్‌ని సెలక్ట్ చేశాను"

"అతనెవరు? ఇంటర్వ్యూకి ఆ పేరు గలవాళ్ళెవరూ రాలేదుగా?"

"అతను మన మంత్రిగారి వియ్యంకుడి పక్కింటివాళ్ళ బాబాయి తోడల్లుడి ఆఫీసులో పనిచేసే డ్రైవర్ తమ్ముడి కొడుకు ఫ్రెండ్" జవాబు చెప్పాడు బాస్. ◆



ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 3-11-89